

# అగ్రహారం కథలు

వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు పొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

## మాట చూస్తే..

**దుర్గమ్మగారంటే మన అగ్రహారంలోనే కాదు,** చుట్టుపక్కల నాలుగైదు ఊళ్ళళ్ళోనూ చాలా పెద్ద పేరే. కుండ బద్దలు కొట్టినట్టు ఉన్నదున్నట్లున్నట్టు మాట్లాడడమూ, ఉన్నమాట మొహమ్మీద అడిగేయడం, మాట ఉంచుకోకపోవడం, కదలలేని స్థంభానికైనా పనిచెప్పగలగడం, అది పూర్తి అయ్యేవరకూ చెప్పిన వాళ్ళకి కుదురు లేకుండా చెయ్యడం, పోనీ కదా అని చేసిన వాళ్ళకి వాళ్ళకి విసుగు ఒచ్చి ఇంక చెయ్యలేను అనేవరకూ వరసపెట్టి పనులు చెప్పడం ఇలాంటి ప్రత్యేక లక్షణాలు ఎన్నో ఉన్నాయి ఆవిడలో.

అగ్రహారంలో పెద్ద ఇల్లు వాళ్ళది. పిల్లల చిన్నతనాన వంటా వార్పూ అవీ అద్భుతంగా చేసినా, కొడళ్ళొచ్చాకా ఆవిడ వంటింటివైపు వెళ్ళే పని తగ్గిపోయింది, కొద్దిగా విచిత్రంగా ఉండే ఆవిడ దినచర్య ఇలా ఉండేది. చాలా పొద్దున్నే అంటే ఈ కాలం చిన్నపిల్లలు ఇంకా అర్ధరాత్రి అనుకునే టైములోనే నిద్ర లేచి, స్నాన పానాదులు కానిచ్చుకుని ఇవ్వాళ 'దూట ఆవపెట్టి కూరా, మావిడికాయ పప్పూ వండండ్రా!' అని కోడళ్ళకి ఆర్డర్ వేసేసి ఆవిడ అరుగుమీద ప్రవేశిస్తే, వచ్చే పోయే వాళ్ళని పలకరిస్తూ, మళ్ళీ లేచేది మధ్యాహ్నం భోజనాల వేళకే.

" ఒరే రమణా! మొన్న అమలాపురం నించీ నల్లమందు తెస్తానన్నావు కదరా!, పది రూపాయలు కూడా ఇచ్చాడు మావాడు " అని ఒకర్నీ,

" ఏమే చాకలీ!, మొన్న నా పంచలు పట్టుకెళ్తానన్నావు, కనిపిస్తే అడుగుతాననా ఈ మధ్య కాలవ గట్టంపట పోతున్నావుట? " అని ఒకర్నీ..

" ఏరా! మీ ఇంట్లో అంత లావు కరివేపాకు చెట్టు పెట్టుకుని మా చెట్టు మీద పడతావేం? అని ఇంకొకర్నీ ఇలా ఏదో ఒకటి సాగుతూనే ఉంటుంది.

ఈ లోపున ఏ యాజులు గారో వచ్చి "దుర్గమ్మ గారూ!, మన సుందరయ్య దక్షిణ దేశం తీర్థయాత్రలు ఏర్పాటు చేస్తున్నాడుట, మీకు ఓ టిక్కట్టు తీయమంటారేం?" అంటే

"ఎందుకయ్యా? పరమేశ్వరుడు ఎక్కడ లేడూ? అయినా నాకు నా ఇల్లే దేవాలయం. కడుపే కైలాసం.. వద్దులే, అయినా బస్సు సుందరయ్య వేయిస్తుంటే మధ్యన నీ సిఫార్స్ ఎందుకయ్యా? టిక్కట్లు కోయిస్తే నీకేమైన ఇస్తానన్నాడా? ఆకలేసినవాడికి గుప్పెడు అన్నం పెట్టు, దాహం వేసిన వాడికి ఓ గ్లాస్ మంచినీళ్ళు ఇవ్వు అంతేకానీ పుణ్యం, పురుషార్థం ఈ తిరుగుళ్ళల్లోనూ, తీర్థయాత్రల్లోనూ ఉన్నాయా? "

ఆవిడ అలా సూటిగా అడిగేసరికి ఆయన చల్లగా జారుకున్నాడు, నాలిక కరుచుకుని.

ఆవిడకి తర తమ భేదం లేదు, కూతురేనా కోడలైనా ఒకటే.

"మీరందరూ పిల్లలతో వస్తేనే మాకు పని. లేకపోతే మాకేం పని ఉంటుంది ఇంట్లో? "అనేది ఆడపిల్లలని.

"అదేవిటే అమ్మా? ఐతే మమ్మల్ని ఇంటికే రావద్దంటావా? " అని అలిగి వాళ్ళు అడిగితే, "రావద్దని కాదు, ఏదో పుట్టింటికి వచ్చాము కదా అని అలా కాళ్ళు చాపుకుని కూర్చుంటే ఎలాగే? మీ వదినలు మాత్రం మనుషులు కాదూ, ఇంతమందికి వండి వార్చడానికి. నలుగురూ నాలుగు పనులూ చేసుకుంటే గబగబా అవుతాయి" అనేది.

నిప్పుని కూడా కడిగి ఇంట్లోకి తెచ్చేంత ఆచారం. మడి పేరుతో పొద్దున్న లేస్తే అందరినీ పరుగులెత్తిస్తే కానీ ఆవిడకి తోచదు.

అందరూ తమ పిల్లలు పట్నాల్లో పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారని గొప్పగా చెప్పుకుంటే తను మాత్రం హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న పిల్లలని " ఆ ఇదేం పెద్ద గొప్ప? మనింట్లో పనిచేసేవాడు చిన్న పాలేరు.. మీరు అక్కడ ఆఫీసుల్లో పెద్ద పాలేర్లు.." అనేది. హాయిగా ఇంటిపట్టున ఉండి పనీ పాటా చూసుకోకుండా ఉద్యోగాల పేరిట దూరం వెళ్ళిపోయారని ఆవిడ కోపం. పిల్లలు ఆవిడ మాటలు పెద్దగా పట్టించుకునేవారు కాదు.

గేదె ఈనింది, పక్కింటివాళ్ళకి జున్ను పంపిద్దామంటే.. " వాడికి పది ఆవులున్నాయి. వాళ్ళకి మనదొక లెక్కా? " అనేది. ఇదేం విచిత్రమయిన మనిషో అనుకునేవారు ఇంట్లో వాళ్ళు.

ఆవిడ నోటి దురుసుతానానికి జడిసి ఎవ్వరూ ఆవిడతో పెట్టుకోరు, పెట్టుకున్నవాళ్ళు ఆ అనుభవాన్ని మర్చిపోలేరు.

ఒకనాటి మధ్యాహ్నం నాలుగు గంటలవేళ, మెల్లగా సువేగా నడుపుకుంటూ వెళుతున్న అతనిని తన ఇంటిముందుకు రాగానే పిలిచింది ఆవిడ.

" ఏమోయ్, శంకరం! బావున్నావా? బొత్తిగా కనపడడం మానేసావ్! ఈ మధ్యన" అంటూ. 'ఆయన తప్పదు శివుడా' అన్న భావంతో బండి దిగి వచ్చి ఆవిడని పలకరించాడు.

"ఏం తోచ్చీ కులాసానా? " అంటూ.

" ఒరే చాప పట్టుకురండిరా!" అని మనవలకి చెప్పి, ఆయన కూర్చున్నాకా, మంచినీళ్ళూ, మావిడి పళ్ళూ అవీ పెట్టాకా, " నా కులాసా సంగతికేంలే? నీ సంగతి చెప్పు. పిల్లలూ, మా కోడలూ అదీ ఎలా ఉన్నారు? అని మొదలుపెట్టి.. ఊ, మొన్న నీ షష్టిపూర్తి అయ్యిందిట కదా, మా వాడు చెప్పాడులే, చాల వైభవంగా జరిగిందిట" అంది ..

" పిల్లలు చేసుకోమని గొడవపెట్టారు, మా రెండో వాడు అమెరికా లో ఉంటాడు కదా, వాడు కూడా వస్తానన్నాడు. అన్ని కలిసి వస్తాయి కదా అని పెట్టుకున్నాము" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

" బావుంది, ఏమాత్రం జనం వచ్చారేం?" అడిగింది ఆవిడ.

అలా కాసేపు ఆయన పుట్టినరోజు వేడుకలూ, షష్టిపూర్తి వేడుకల గురించి మాటలయ్యాకా మెల్లగా అందావిడ.

" ఊ ఇప్పుడు నీకూ అరవై నిండాయి కనక నిన్నూ షూట్ చేసేయవచ్చు, ఏమంటావ్?" అని.. జేబులో బాంబు పేలినట్టుగా స్థాణువైపోయాడు ఆయన. తెల్లగా పాలిపోయిన మొహంతో మెల్లగా సెలవు పుచ్చుకున్నాడు. ఆవిడ ఆ మాట అనడానికి కారణం.

సరిగ్గా ఆరునెలల్రకితం దుర్గమ్మ గారు పక్కన ఉన్న ఊరిలో చుట్టాల ఇంట్లో పెళ్ళికి వెళ్ళినప్పుడు బండి ఎక్కబోతూ ఆవిడ జారి కింద పడేసరికి, కాలులో నరం బెణికి ఇద్దరు ముగ్గురు పట్టుకుని ఎక్కిస్తే కానీ ఆవిడ బండి ఎక్కలేకపోయింది, ఆవిడకి సహాయంచేసిన వాళ్ళతో ఈ శంకరం వెటకారంగా నవ్వుతూ, " శుభ్రంగా రామా, కృష్ణా అని ఇంట్లో కూర్చోక తగుదునమ్మా అని ఈ ముసలాళ్ళందరూ పిలిచినచోటకల్లా పరుగులెందుకో? అయిన నన్నడిగితే అసలు అరవై ఏళ్ళు దాటిన వాళ్ళందరిని షూట్ చేసి పారెయ్యాలి" తన మాటలకి అందరూ నవ్వుతున్నారన్న ఆవేశంలో అతను అన్న మాటలు ఆవిడ చెవిన పడనే పడ్డాయి. మాట ఉంచుకునేది ఆవిడ తత్వమే కాదు.

" ఏం దుర్గమ్మ పిన్నీ! మంచికైనా, చెడుకైనా ముందుటావే? ఎక్కడ చూసినా నువ్వే కనిపిస్తావు" అంది కూతురి వరసైన వనజ. " ఒసే పిల్లా! తెలివిగా మాట్లాడుతున్నాననుకుంటున్నావా! నేను వచ్చిన చోటకల్లా నువ్వు కూడా రాబట్టే కదా నేను వస్తున్నానో లేదో నీకు తెలిసేది. అంటే ఇద్దరం ఒకటే అన్నమాట" అని మెత్తగా చివాట్లు పెట్టేసరికి, వనజ తిరిగి వెళ్ళేవరకూ ఆవిడని తప్పించుకుని తిరిగిందని వేరే చెప్పక్కర లేదు. ఇలాంటివెన్నో సంఘటనలు.

ఒక్కసారి కూడ ఆవిడది తప్పులేదు. అనవసరంగా ఆవిడని ఎవ్వరినీ ఒక్క మాట అనేది కాదు. తననెవరైనా అంటే ఊరుకునేది కాదు. నిజాన్ని నిజంగా గుర్తించడం చేతకాని వారూ, గుర్తించడానికి ఇష్టపడని వారూ ఆవిడని గయ్యాళి అన్నా ఆవిడ పట్టించుకోలేదు.
అలా ఖచ్చితంగా తను కోరిన విధంగా, ఎక్కడా రాజీ పడకుండాజీవితాన్ని గడిపిన ఆవిడ ఒకనాడు పెరట్లోకి వెళ్ళి వస్తూ కాలు జారి నూతిపళ్ళెంలో పడిపోయింది. మంచంలో ఉన్నా ఆవిడ తత్వంలో ఏమాత్రం మార్పు లేదు. వచ్చిన పని అయిపోయిందనో, లేక స్వర్గంలో ఎవరికైనా మాట అప్పచెప్పాలనో మరి పడిపోయిన పదోనాడు ఆవిడ వెళ్ళిపోయింది. చూడటానికి చాలా మంది వచ్చారు. పడిపోయినప్పటినించీ. అది చిత్రం కాదు. వారు చెప్పిన విషయాలే ఇంట్లో వారికి చిత్రంగానూ, ఆశ్చర్యంగానూ అనిపించాయి.

మొదట వచ్చినది అన్నపూర్ణ కావిడి సాధువు. "అయ్యో అమ్మగారు పడిపోయినట్టు నిన్నటివరకూ తెలియలేదమ్మా, రోజూ రెండు గుప్పిళ్ళు బియ్యం వేసికాని నన్ను పంపలేదు ఇప్పటివరకు. 'సాక్షి గణపతి కన్నతల్లివి సద్గుణావతి శాంభవీ" అని నాలుగు సార్లు పాడమనేవారు. 'అన్నీ ఉన్నవారికి విందులూ, వినోదాల పేరిట గంపెడు అన్నం పెట్టినా నీకు ఈ గుప్పెడు బియ్యం వేసిన తృప్తి రాదయ్యా, నిన్నా మొన్నా పాట పాడుతూ దగ్గావు, ఆరోగ్యం జాగ్రత్త అన్నారమ్మా కిందటివారం నేను వచ్చినప్పుడు" అన్నాడు.. ఠంగు ఠంగు మంటూ గంటలు కొట్టుకుంటూ, అంతకంటే ఖంగున మోగే కంఠంతో పాట పాడే అతని గొంతు జీరబోయింది.

దుర్గమ్మగారు పడిపోయిందన్నప్పటినించీ ఆమె పక్క వదలకుండా ఉంది ఊరంతా సీతమ్మామ్మ అని పిలిచే సీతమ్మగారు. ఆవిడా, కొడుకూ నాలుగిళ్ళకవతల ఉంటారు. కోడలు చాలా ఏళ్ళక్రితమే పోయింది, కొడుకు ఎంత చెప్పినా మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. పొద్దున్న తను వండింది తినేసి కొడుకు ఉద్యోగానికి వెళ్ళిపోతే సాయంత్రం వరకూ అరుగు మీద కాళ్ళు చాపుకుని కూర్చుని వచ్చే పోయే జనాలని చూడడమే ఆవిడకి కాలక్షేపం. తను ఎప్పుడూ గుమ్మం దాటి వెళ్ళని దుర్గమ్మ గారు రోజూ మధ్యాహ్నం పూట రెండు మావిడి పళ్ళో, సపోటాలో, కొబ్బరినూజో, ఏదో ఒకటి పట్టుకుని సీతమ్మామ్మ దగ్గరకి వెళ్ళి ఒక అరగంట కూర్చుని ఏదో ఒక కబురు చెప్పి వచ్చేది. ఆ మాటే చెప్పి ఆవిడ కంట నీరు పెట్టుకుంది. "వాడు పొద్దున్న పోతే రాత్రి వచ్చే వాడు. అప్పటివరకూ దీపసెమ్మేలా ఒక్కదాన్నీ ఉండేదాన్ని. అందుకే వచ్చేది దుర్గమ్మ. పైగా అనేది కూడా. ఒక పూట అన్నం లేక పోయినా ఉండచ్చు కానీ, మాట లేకుండా ఎలాగే?

అని.పిలవందే ఎవ్వరింటికీ వెళ్ళని దుర్గమ్మ నన్ను చూడడానికి రోజూ నాకుశలమడిగే కనకదుర్గమ్మలాగే వచ్చేది. ఏమిటో? ఎప్పటికి కోలుకుంటుందో "అని బావురుమంది ఆవిడ.

మర్నాడు వచ్చారు గుడిలో పూజారి గవరయ్య గారు. అమ్మగారు పడిపోయారుట అనుకుంటూ. కూతురిని చూడటానికి వెళ్ళారు ఆయన. నాడి చూసి కొద్దిగా కంగారు పడ్డాడు. ఆయన రోజూ వచ్చి ఆవిడకి పురాణం చదివేవారు. చాలా శ్రావ్యమైన గొంతు - ఆయనది. చక్కగా చదివి అర్థం విడమరిచి చెప్తే ఆవిడ అతి శ్రద్ధగా వినేది. ఆయన ఇలా చెప్పాడు.

" ఐతే గవరయ్యగారూ! పిల్లకి సంబంధాలేమైనా చూస్తున్నారా?" అని అడిగారుట దుర్గమ్మగారు ఓనాడు అతనిని.

.. "నేను చూసేదేముందమ్మా? అంతా ఆయనే చూసుకుంటాడు కదా" అన్నాడు ఆయన కొంత అమాయకంగానూ, కొంత భక్తితోనూ..

" బావుందయ్యా! పిచ్చి పోతన గారి కాలమా ఇది.. పలికెడిది భాగవతమట అనుకోవడానికి. మానవ ప్రయత్నం చెయ్యకపోతే పనులెలా అవుతాయి? ఇంద ఈ ఐదు వేలు ఉంచు.. పిల్లకి మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యమన్నారమ్మా .. ఇదేవిటమ్మా? అంటే. అవునయ్యా, గుళ్ళో రాముడికి అని అడిగితే ఎంతైనా ఇస్తారు అందరూ, రాముడిని క్షణం వదలకుండా కొలిచే ఈ పూజారి అడిగితే ఇచ్చేంత మనసు ఉండదు. 'దేవుడు వరమిచ్చినా పూజారి ఇవ్వడన్నది పాత సామెత ఐతే, దేవుడికెంత వచ్చినా పూజారికి వచ్చేది పళ్ళెంలో వేసే దక్షిణేఅన్నది నేటి నిజం.. ఇది నా పుట్టింటి వారు నాకిచ్చిన భూమి మీద వచ్చిన శిస్తు డబ్బు. దీనితో ఇంతకంటే మంచి పని జరుగుతుందా? అన్నారండి. పైగా ఈ విషయం మనిద్దరిమధ్యనే ఉండాలి అన్నారండి. అవసరమెరిగి సహాయం చెయ్యడం నిజంగా - ఆవిడకి తెలిసినట్టు మరెవరికీ తెలియదండి" అంటూ.

"మంత్రసానులూ, ఎరుకలసానులూ అంటూ నాటు వైద్యాలతో పిల్ల ప్రాణం తీయకు, శుభ్రంగా అమలాపురం తీసుకువెళ్ళి పెద్ద డాక్టర్ గారి దగ్గరకి తీసుకెళ్ళు. పండంటి మనవడిని ఎత్తుకోమన్నారమ్మా, నాచేతిలోఐదువందలెడుతూ". అని చాకలి చెప్పింది. "అమ్మగారు లేచి తిరిగితే గుళ్ళో మూడు కాయలు కొడతానని మొక్కుకున్నానమ్మా" అంది.

"అదేవిట్రా! పడుచు పెళ్ళాం మాట విని తల్లిని పట్టించుకోవూ.. ఊరికే అన్నారా !తల్లి అల్లం, పెళ్ళం బెల్లం అనీ. కని పెంచినది నీకు చేదయిందీ!.. వెళ్ళు.. నా మాట విని మీ అమ్మని మీ మావయ్య ఇంటినించి తీసుకురా.. పొరుగింటి గొడవ ఊరందరికీ వినవేడుకట. అని నాలుగూ కడిగేసి నన్ను అమ్మని తీసుకు రావడానికి పంపించారు "అని భాగ్యమ్మ కొడుకు చలం చెప్పాడు.

ఇలా ఆవిడ పోయిన పదిరోజుల వరకూ ఎవరో ఒకరో వస్తూనే ఉన్నారు, జనాలకి తెలియని ఆవిడలోని సరికొత్త కోణాలని ఆవిష్కరిస్తూనే ఉన్నారు. 'ఇదేం మనిషి? ఓ పాపం, పుణ్యం అక్కరలేదూ? అనుకున్నారు ఒకప్పుడు జనం ఆవిడగురించి. 'ఎవరినీ లెక్కచెయ్యదు, ఎవ్వరూ అక్కర్లేదు అనుకున్నారు. ఇప్పుడు ఆవిడ వ్యక్తిత్వంలోని సరికొత్త పార్శ్వాన్ని చూస్తుంటే వారికి ఆవిడ అప్పుడప్పుడూ చెప్పిన మాటలు గుర్తు వస్తున్నాయి.

"మెరక నీరూ పల్లానికే, పల్లపు నీరు పల్లానికే అని.. ఉన్నవాళ్ళకే చుట్టరికాల పేరిట మళ్ళీ కానుకలు ముట్టచెప్తారు. దానివల్ల ఏం లాభం?" ఎవరైన వచ్చినప్పుడు కోడళ్ళు ఎద్దైనా బహుమతి పెట్టబోతే అంటుంటే.. 'ఇదేవిటీ ఇలా అంటారు?' అనుకున్నారే తప్ప అందులో అర్థం తెలుసుకోలేదు.

అలాగే. గుడికి రెండు ఫానులూ, ప్రహరీ గోడకి కొంత డబ్బూ ఇద్దామంటే "రామదాసు కాలం నించీ ఆయనకి అందరూ ఇస్తూనే ఉన్నారు,, ఇవ్వాళ మనం కొత్తగా ఇచ్చేదేముందీ? అంతలా జీవితాన్ని పణంగా పెట్టి అన్నీ ఇచ్చిన నాడు రామదాసుకి మిగిలిందేవిటి? అంటే రామదాసుడైన పూజారి గారికి సహాయం చేద్దామని ఆవిడ ఉద్దేశ్యం అని వారికానాడు తెలియలేదు. "అమ్మ

సంగతి తెలియనేదేముంది? ఏదో పెద్దది" అని భార్యలకి సర్ది చెప్పిన ఆవిడ కొడుకులు ఈనాడు "చూసారా! అమ్మ అసలు మనసు" అన్నట్టు సగర్వంగా చూసారు.

చివరిగా వచ్చిన ముందు చెప్పిన షూటింగ్ ఎపిసోడ్ లోని శంకరం కూడా.. "నేను చేసిన తప్పు నాకు తెలియడానికి నా మాట నాకు అప్పచెప్పిందే కాని.. నాకు చేసిన సహాయం మాత్రం తక్కువదా? నాకు నిజంగా గుండెపోటు వచ్చినప్పుడు, నాకు నోట మాట రాకా, మా ఆవిడకి ఏం చెయ్యాలో తెలియకా ఉన్న సమయంలో  బండినీ, కొడుకునీ తోడు పంపింది. వాడి పిల్లలు దూరాన ఉన్నారు,, ఇలాంటప్పుడు కాకపోతే ఎందుకు ఈ చుట్టరికాలూ, బంధుత్వాలూ అంటూ. వాడు కనక సమయానికి రాకపోతే నేనే తోచ్చి కన్నా ముందు పోయేవాడిని..వినిపించే మాట కటువే కావచ్చు కానీ కనిపించని మనసు వెన్న. మాట చూస్తే మావిడల్లం, మనసు మాత్రం నిజంగా పటిక బెల్లమే.  ఏప్పుడూ ఒకే తీరుగా విక్టోరియా మహారాణి అంత ఠీవిగా బ్రతకడం ఆవిడకే చెల్లింది. " అన్నాడాయన కంటనీరు పెట్టుకుంటూ.